## వృద్ధురాలికి సెడ్స్ సంస్థ చేయూత



ఆశ్రయం పొందిన వృద్ధురాలితో సెడ్స్ సంస్థ ప్రతినిధులు

ఎదులాపురం, నవంబర్ 5 : ఆదిలాబాద్‌లోని దుర్గానగర్‌కు చెందిన వృద్ధురాలు గోరుబాయిని కుటుంబీకులు ఇంటి నుంచి వెళ్లగొట్టారు. ఆమె పేరిట ఉన్న ఆస్తిపాస్తులను తమ పేరిట బలవంతంగా రాయించుకున్నారు. వృద్ధురాలిని దుర్గామందిరం వద్ద వదిలేసి బిక్షాటన చేసుకొని బతుకు అని కర్కశంగా చెప్పి వెళ్లిపోయారు. నిస్సహాయస్థితిలో విలపిస్తూ కూర్చున్న ఆమెను స్థానిక మహిళలు గమనించారు. ఈ విషయాన్ని మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయికి ఫిర్యాదు చేశారు. ఆమె తక్షణం స్థానిక సెడ్స్ సంస్థ వారితో మాట్లాడి వృద్ధురాలికి ఆశ్రయం కల్పించాలని సూచించారు. స్పందించిన సంస్థ డైరెక్టర్ సురేందర్ సిబ్బంది అశోక్ వృద్ధురాలిని కేఆర్‌కె కాలనీలోని వృద్ధాశ్రమంలో చేర్చుకున్నారు. నిస్సహాయపరిస్థితిలో ఉన్న వృద్ధురాలికి చేయూతనిచ్చిన మహిళా కమిషన్ సభ్యురాలు , సెడ్స్ సంస్థ వారికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 5 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చోడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చోడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చోడలో తెలుగు, ఇంగ్లిష్, బాటనీ, జువాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టులో ఒక ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 7లోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 5 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. యువ నాయకుడు గణేశ్ నాయుడు ఆధ్వర్యంలో కాలనీ చెందిన యువకులు, మహిళలు 300 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే మహిళలకు ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. రెండు కోట్ల ఉద్యోగాలు జాడ లేదని, మహిళలకు జీరో అకౌంట్ తీపించి అందరి ఖాతాలో రూ.15లక్షల వేస్తానని మభ్యపెట్టారు. ఉచిత గ్యాస్ పంపిణీ అని చెప్పి ఓట్లు దండుకొని అదే ప్రజలపై వంట గ్యాస్ ధరను రూ.1200 పెంచినందుకు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఇలాంటి తరుణంలో పేద ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు రూ.2016 పింఛన్ అందించిందన్నారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రూ.లక్ష 116 అందిస్తున్నదని తెలిపారు. ఎన్నికల ప్రచారం కాగానే ఏప్రిల్ నెల నుంచి వీటితో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, వార్డు కౌన్సిలర్లు బండారి సతీశ్, అశోక్ స్వామి, పందిరి భూమన్న, కొండా గణేశ్, సంజయ్, నాయకులు గోలి శంకర్, ఆశక్క, రమక్క, కస్తాల ప్రేమల, బుజ్జక్క, తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

### బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

ఎదులాపురం, నవంబర్ 5 : ఎన్నికలు దగ్గర సమీపిస్తున్న వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ క్యాడర్ పూర్తిగా తగ్గుతూ తన గ్రాఫ్‌ను పూర్తిగా పడిపోయిందని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్‌ను బలపరిచేందుకు ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన మొత్తం 200 మంది పార్టీలో చేరారు. రాంనగర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మునీర్, బీజేపీకి చెందిన బట్టు గణేశ్ ఆధ్వర్యంలో 100 మంది, గిమ్మ ఉపసర్పంచ్ టీ రమేశ్, రాజు సతీశ్‌తో పాటు మరో 100 మంది చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త ఐక్యమతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రగతిని చూసి ఆశీర్వదించండి

- కారు గుర్తుకు ఓటేస్తేనే మరింత అభివృద్ధి
- ఆదిలాబాద్‌లో జోరుగా ఇంటింటి ప్రచారం

ఎదులాపురం, నవంబర్ 5 : నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతున్నది. ఆదిలాబాద్‌లోని మసుద్‌చౌక్‌లో ఐసీడీఎస్ మాజీ ఆర్గనైజర్ కస్తాల ప్రేమల, నాయకులు ఇంటింటికీ, వివిధ షాపులలో తిరుగుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగు రామన్న చేసిన అభివృద్ధి చూసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కారు గుర్తుకు ఓటేస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి మమత, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షురాలు పర్వీన్, నాయకులు సురేఖ, రేఖ, తదితరులు పాల్గొన్నారు.



ఎదులాపురం: కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

### అభివృద్ధి జరగలేదని అనడం హాస్యాస్పదం

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 5 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో తెలంగాణతో పాటు ఆదిలాబాద్ జిల్లాకు అత్యధిక అవార్డులు రావడం జరిగిందని, బీజేపీ నేతలు అభివృద్ధి జరగలేదని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని 36వ వార్డు రవీంద్రనగర్‌లోని పార్ట్ ఆఫ్ శాంతినగర్, మసూద్‌నగర్‌లో ప్రచారం కొనసాగించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుస్తూ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ 70 ఏళ్లు పాలించి ప్రభుత్వ పాలన చేశాయే తప్ప ప్రజాపాలన అందించలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో లేని విధంగా నేడు గురుకులాలతో పాటు మైనార్టీ సంక్షేమం, విద్యార్థి మెరుగైన ప్రామాణికతకు పెద్ద పీట వేసిందన్నారు. నేటి అభివృద్ధికి విద్యను ప్రాధాన్యం కల్పించడం ద్వారా సమాజంలో ప్రతి యువత అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అర్థం చేసుకొని మళ్లీ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్థానిక అభ్యర్థి ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలను కాపాడుకున్న వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, పట్టణాధ్యక్షుడు అజయ్, మోబిన్, సాజిత్ ఉద్దీన్, బొడగం మమత, సురేఖ, పర్వీన్, ధారవేణి రాము, గాజు రాథోడ్ పాల్గొన్నారు.



### జైనథ్ మండలంలో..

జైనథ్, నవంబర్ 5 : మండలంలోని కాప్రి, ఉమ్రి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, ముఖ్యనేతలు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల మ్యానిఫెస్టో చూపుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, నాయకులు ఎల్టీ వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎల్టీ భూమారెడ్డి, ఈరన్న, రామన్న పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 5 :జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. 14, 17, 19 సంవత్సరాల విభాగంలో బాలబాలికలకు వివిధ వెయిట్ కేటగిరీల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణతో పాటు చక్కటి ఆరోగ్యాన్ని దేహదారుఢ్యానిచ్చే కరాటే విద్యలో క్రీడాకారులు రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను అత్యంత పారదర్శకంగా పోటీలు నిర్వహించి జోనల్ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పెటా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, పోటీల ఆర్గనైజర్ మిట్టు దత్తు, న్యాయ నిర్ణేతలు ప్రవీణ్, ముఖేశ్, కరాటే మాస్టర్లు, పోషకులు పాల్గొన్నారు.

# కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలి



పిప్రిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నార్నూర్, నవంబర్ 5 : గాదిగూడ మండలంలోని కుండి శేకుగూడ, మారుతిగూడ, పిప్రి, కుండితో పాటు నార్నూర్‌లోని ఎంపల్లి, జైతుగూడ, ఖైరదట్వా, బొప్పాపూర్, నడ్డంగూడ, గుండాల, మహదాపూర్, ఖంపూర్, ఖాతిగూడ, మహాగావ్, శేకుగూడ, తండా గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో గాదిగూడ ఎంపీపీ ఆడ చంద్రకళారాజేశ్వర్, వైస్ ఎంపీపీ మర్సివనే యోగేశ్, మండలాధ్యక్షుడు పుసం బాదిరావ్, సర్పంచ్ మెస్రం జైవంత్‌రావ్, కొడన జాకు, దేవ్‌రావ్, వామన్, నాయకులు పాల్గొన్నారు.